# ఆశీర్వాదం

-శ్రీమతి ఉమాభాస్కర్

రాత్రివేళ... రేడియోలో వివిధ్భారతి ప్రత్యేక జనరంజని స్వర్గీయ ఘంటసాల గాన మాధురి సమర్పిస్తోంది.

ఆగానగంధర్వుని ప్రాశస్థ్యాన్ని గురించి వర్ణిస్తోంటే ... దాని తాలూకు మనోవేదన వ్యాఖ్యాత గుండెల్లో నుండి పొంగి విషాద తరంగమై వెలువడుతూంది.

ఆయన సజీవంగాలేరనే నగ్నసత్యం దిగంతాల్లో మార్మోగుతూ సకల జనావళినీ సమ్మోహితుల్ని చేసి మైమరపిస్తూంది.

ఆగానం - ఏదో తెలీని తన్మయత్వంలో. మధురానుభూతుల్లో ఓలలాడిస్తూ కాసేపు మరోలోకంలో విహరింపచేస్తోంది.

ఎంతటి కఠోర పదాలైనా భావ. తాళ. రాగ యుక్తంగా మలచి తన కంఠంలో నుండి రాగమాలికలుగా వెలువరించి రసమయ జగత్తులో లీనంచేసి సర్వప్రపంచాన్నీ మత్తెక్కించే 'పస' ఆయన కంఠంలోనే ఉంది!

ప్రేమ గీతాలు ఎంత కవ్విస్తాయో విరహ గీతాలు అంత ఎడబాటును సూచిస్తాయి.

విషాద గీతాలు ఎంత కన్నీరు కార్పిస్తాయో హాస్యగీతాలు అంతగా మనసుల్ని వశపరచేస్తాయి.

భావావేశ గీతాలు ఎంతటి పిరికివాళ్ళనైనా గుండె తట్టి, మత్తు వదలగొట్టి, వెన్నుతట్టి ఉత్తేజపరచి కర్తవ్యోన్ముఖుల్ని చేస్తాయి.

పదమైనా పద్యమైనా గీతామృతాన్ని చిలుకుతుంది.

భక్తిగీతాలు. పరమ నాస్తికులైనా హృదయాల్ని కదిలించి ఆధ్యాత్మిక చింతనలో ముంచి మనోనేత్రంతో ఆ దైవాన్ని ఒక్క క్షణం దర్శింపజేసి మానసక్షేత్రంపై శాశ్వతంగా ప్రతిష్టించుకునేలా చేస్తాయి.

ఆయన కంఠమాధుర్యం వెనుక తరాలవారినీ, ముందు తరాలవారినీ కూడా అలరించి ఆనందాబ్ధిలో ఓలలాడిస్తుంది. అలా ఆయన కంఠంలో నుండి వెలువడే పాటైనా, పద్యమైనా, పదమైనా, రాగమైనా, భావమైనా గుండెపొరల్ని చీల్చుకుని అలా... అలా... ఏదో... ఏదో మత్తైన లోకానికి తీసుకువెళ్ళి బాహ్యప్రపంచాన్ని మరపింపచేస్తాయి.

ఆ మృదు మధుర గంభీర కంఠమాధుర్యం వాయు



తరంగా లలో లీనమై గుండెను తట్టి.... ఓ....హ్హ...

ఆ అధునాతన భవంతి హాలులో చివరగా... ప్రత్యేక వసతి కల్పించిన చిన్న గదిలో తమలాగే శిధిలావస్థలో నున్న రెండు కుక్కిమంచాలపై... రెండు మానవాకారాలు భార్యాభర్తల రూపాల్లో పడి ఉన్నాయి. మంచాలు కుక్కి వైనా వాటి నిజస్వరూపాలు తెలీకుండా పైన ఖరీదైన సేలం దుప్పట్లు పరచి ఉన్నాయి.

అవి వాటిపైనే గతాన్ని తలపోస్తూ... భవిష్యత్తును అంచనా వేసుకుంటూ... సాలోచనగా శూన్యంలోకి అవలోకిస్తూ నిస్త్రాణగా పడి అస్థిపంజరాల్లా వున్నాయి.

ఆయన పేరుకు తగ్గట్లు దానశీలతకూ, ధర్మ నిరతికీ, దయార్థ హృదయతకూ ప్రతిరూపమైన ధర్మమూర్తి గారు!

ఆమె... ఆయన కష్టసుఖాల్లో, ఆనందంలో, ఆవేదనలో సగభాగం పంచుకుని బాధ్యతలు గుర్తించి ఆయన భారం తగ్గించటానికి దైవం ప్రసాదించిన జీవనజ్యోతి విశాలాక్షి.

అన్యోన్యతకు ప్రతిరూపాలు వాళ్ళు!

బ్రతుకు సమరంలో జీవితంతో పోరాడుతూ జీవన రథాన్ని ఈడ్చటానికి భార్యాభర్తల రూపంలో ఇద్దర్ని తోడు చేశాడా భగవంతుడు.

కన్నబిడ్డలున్నా ఎందరు బంధుమిత్ర సపరివారమున్నా... వయసు వాలి, రక్తం ఉడిగి, శరీరం శిథిలమై బ్రతుకు భారమైనా జీవిత చరమాంకంలో ఒకరికొకరు అండై ఆలంబనై జంటజ్యోతుల్లా నిలవగలిగేది భార్యాభర్తలు ఇద్దరు మాత్రమే!

చివరి క్షణం వరకూ... బ్రతుకు కొడిగట్టేవరకూ... ఆ జ్యోతులు రెండూ ఒకరి కోసం ఒకరు ఏ ఒక్కరూ ఆగిపోకుండా వెలగగలిగి ఉండటం ఎన్నెన్నో జన్మల పుణ్యఫలం...

కానీ... గత జీవితానికీ, ప్రస్తుత పరిస్థితికీ ఊహించలేనంత దూరం... ఊహ కందనంత దూరం... అందమైన పూల దుప్పట్ల కింద శిధిలావస్థలో నున్న కుక్కి మంచానికీ ఇప్పటి తమ జీవితాలకీ తేడా ఏమాత్రం లేదు.

మంచాలపైనున్న అందమైన దుప్పట్లలా తమ వంటిపై జలతారు దుస్తులు తళతళ మెరుస్తూ కడుపులో పేగులు నులకదారాల్లా ఆకలితో మెలిపెడుతున్నా, వయసుకు మించిన వృద్ధాప్యం మీదపడి ఎండిపోయిన శరీరాలపై చుట్టుకున్న జరీదుస్తులు తాము సుఖ జీవనం సాగిస్తున్నట్లు చూపరులకు భ్రాంతి కలిగిస్తున్నాయి.

యధాలాపంగా పక్కకి తిరిగిన ధర్మమూర్తిగారికి... శూన్యంలోకి చూపులు సారించి దీర్ఘంగా ఆలోచనా స్రవంతిలో మునిగిఉన్న విశాలాక్షమ్మ దృష్టిలో పడింది.

ఒకప్పుడు తను ప్రేమించి ఆరాధించిన కాంతివంతమైన విశాల నేత్రాలు...కన్నీళ్ళు కార్చి, కార్చి... లోపలికి చొచ్చుకుపోయి కాంతిహీనమై జీవం కోల్పోయినట్లు చూపులు పేలవమై, బలహీనంగా రెపరెపలాడుతున్నాయి.

కనురెప్పలు దేనికోసమో నిరీక్షిస్తున్నట్లు, అర్ధశతాబ్దం పైగా ఆమెతో కలసి కాపురం చేస్తూన్న ధర్మమూర్తి గారికే తెలుసు. ఆమె ఆలోచనా తరంగాలకు అర్థం.

ఆయన కొక్కడికే వినిపిస్తుంది ఆమె గుండెలోని వేదన, రోదన. చివరి రోజుల్లో కొద్ది కాలమైనా సుఖం లభించి నిశ్చింతగా, ప్రశాంతంగా, సంతోషంగా జీవితాన్ని అనుభవించటానికి అవకాశం కలుగుతుందేమోనని నిరీక్షించే ఆమె కన్నుల్లోని ఆశ, హృదయఘోష ఆయన మనసుకు మాత్రమే తెలుసు.

"హుఁ! పిచ్చిది. చేజారిన జీవితం గాజు పాత్రలా నుగ్గు నుగ్గు అయిందనీ, ఆకులు పట్టుకోవటానికి ఆస్కారమే లేకుండా చేతులు కాలిపోయాయనీ, ఆత్మీయతాభిమానాలు పంచవలసిన గుండెలు కరుడు కట్టిపోయాయనీ, స్పందనకు తావులేకుండా కాఠిన్యం వహించాయనీ గుర్తు చేసుకోదు.

గుండె 'కోత'కు గురైనప్పుడల్లా వాటిని గుర్తు చేసుకుంటే హృదయభారం కొంతైనా తీరే అవకాశముంది. ఆ క్షణంలో తనే కలగజేసుకుని ఆమె ఏకాగ్రతను తనవైపు మరల్చుకుంటే బాధనంతా పక్కకునెట్టి మందంగా నవ్వుతుంది.

తనను చూచి ఆయన బాధపడకుండా ఉండాలని, తను అలా చేస్తే ఆయన బాధపడకుండా ఉంటాడనీ. ఆయన బాధ పడటం ఆమెకు మరింత గుండె కోతనీ, తను నిశ్చింతగా ఉందని ఆయన అనుకుంటే ఆయన మనసులో బాధ అనేది చోటు చేసుకోలేదని ఆమె అభిప్రాయం.

అందుకే... ఒకరికోసం ఒకరు ముఖాలపై కృత్రిమ మందహాసం పులుముకుంటున్నారనీ ఇద్దరి అంతరాత్మలకూ తెలిసినా ఏ ఒక్కరూ బైట పడరు...

ఈ రోజు అనుకోకుండా ఆయన దృష్టిలో పడిపోయింది. ఎంత తప్పించుకుందామన్నా ఆమె వశం కాలేదు.

"ఏమిటి విశాలా? ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?"

పరధ్యానంగా ఉన్న ఆమె భర్తకు దొరికిపోయానన్న తడబాటుతో కలవరపడింది. తప్పించుకునే ప్రయత్నంలో నవ్వబోయి ఓడిపోయింది.

పెదాలు నవ్వుతున్నా గుండెల్లో నుండి పొంగిన లావా కన్నీళ్ళుగా కళ్ళల్లోకి పొంగింది.

బలవంతంగా దుఃఖభారాన్ని అదిమిపెడుతున్న గుండె కూడా ఆత్మీయుల పలకరింపు లాగానే బలహీనమై కన్నీళ్ళుగా వెలువరిస్తోందేమో!


"ఏం లేదండీ... కాలచక్రం వెనక్కు దొర్లితే... పుంటసాల బ్రతికి ఉన్నట్లే కదూ?"

ఆమెనోటి నుండి వెలువరించిన ఒక్క వాక్యానికి ధర్మమూర్తిగారి ప్రాణాలన్నీ తోడేసినట్లయింది.

భార్య అంతర్యం అవగతమై విలవిలలాడారు. కళ్ళు మౌనంగా దుఃఖాశ్రువులు రాల్చాయి.... 'కాలం వెనక్కు జరిగితే తమ జీవితం కూడా బ్రతికి ఉన్నట్లే'నని ఆమె మనోభిప్రాయం!

కాలచక్రం వెనక్కు దొర్లితే... తామిద్దరూ కూడా...

ఆమె ఎంతగా మనఃక్షోభను అనుభవిస్తూందో అర్థమై పక్కకు వంగి ఆమె కన్నుల్లో నిలిచిన ఎరుపైన కన్నీటిని




డి. శ్రీధర్, డి. కొండాపురం, రాయదుర్గ, అనంతపురం.

తన ఉత్తరీయంతో సున్నితంగా అద్దారు. గుండెల్లో బాధనంతా ఉత్తరీయం పీల్చేసినట్లు తేలిగ్గా నిట్టూర్చింది.

"నిద్ర పట్టటం లేదా విశాలా?" ఆత్మీయత వెల్లువై పొంగుతుంటే అడిగారు.

ఆమె మనసును మళ్ళించటానికే ఆయన ప్రయత్నం.

"ఉఁ" అసంపూర్ణంగా అన్నది ఏమీ చెప్పలేక.

అది ఆకలి బాధని ఆయనకూ తెలుసు. ఒకప్పుడు పంచభక్ష్య పరమాన్నాల రూపంలో పుష్కలంగా నిండిన కడుపులు! ఇప్పుడవేమీ కోరటం లేదు. ఆకలి రాక్షసిని పారద్రోలటానికీ, ఉదర సామ్రాజ్యాన్ని జయించటానికీ వేళకి ఏదైనా కొంత చాలనుకుంటున్నారు.

దేహ దారుఢ్యం బాగా ఉండి శ్రమించే రోజుల్లో రోజుల తరబడి ఆహార పానీయాలు తీసుకునే తీరిక లేకపోయినా అలసిన శరీరాలు ఆదమరచి హాయిగా నిద్రపట్టేది.

ఇప్పుడు 'తినేవేళ సమీపిస్తుంది' అనుకుంటేనే పేగులు కడుపులో వింతశబ్దాలు సృష్టిస్తున్నాయి. ఆగలేక నీళ్ళు పోస్తే గుడగుడమంటూ మొరాయిస్తాయి. ఐనా తమని గుర్తుచేసుకుని దయతలచి ఆహారం చేతికి ఇచ్చి కడుపులో పడేవరకూ రోజూ నిరీక్షణ తప్పదు.

భర్త తననే చూడటం గమనించిన విశాలాక్షమ్మ తెచ్చి పెట్టు కున్న అవలింపుతో కళ్ళు మూసుకుంది...

వాళ్ళకీ వేళయినట్లుంది. రోజూ వేళకి వచ్చే బిచ్చగాళ్ళైన భార్యాభర్తలు అలవాటుగా మెల్లగా నడుచుకుంటూ వచ్చి వీధిగేటుముందు నుంచున్నారు.

కోడలు రాధిక వెయ్యబోయే 'కబళం' కోసం ఇంట్లోకి చూస్తూ. అధికార యుతంగావస్తే వేసే 'కబళం' కూడా వెయ్యరేమోనన్న సంకోచంతో, భయంతో మౌనంగా ఎదురు చూస్తున్నారు తామిద్దరి లాగే!...

లోపల... ఏ.సి.బెడ్‌రూంలో యూఫోం బెడ్‌పై కొడుకు రాజా, కోడలు రాధిక తమ గారాల ముద్దు బిడ్డడు ఎనిమిది నెలల పసికందుని కిందామీదా వేసుకుని ముచ్చట్లాడుతూ ముద్దు మురిపాలు తీర్చుకుంటూ పరవశంతో మునిగిఉన్నారు.

అంతలో వాడు పరుపుపైనే రెండు పనులూ చేసినట్లున్నాడు.

పక్కలో పాము పడ్డట్లు ఇద్దరూ తుళ్ళిపడి 'ఆయా' ని పిలిచి శుభ్రం చేయించారు...

కడుపులో బరువు దిగిపోగానే ఆ పసివాడికి ఆకలి విజృంభించినట్లుంది. తీవ్రస్థాయిలో ఆరున్నొక్కరాగం అందుకున్నాడు. రాధిక ఆయానిపిలిచి బాబుని అందించింది.

ఆయా గిన్నెలో ఏదో పేస్టులా కలిపి ఆ మిశ్రమాన్ని వాడి నోటికి అందిస్తూంది.

అనుకోకుండా ధర్మమూర్తిగారు నోరు చప్పరించారు.

వయసులో ఆ పసివాడికీ, తమకీ కొన్ని పుష్కరాల తేడా ఉన్నా జిహ్వా చాపల్యం పసివాడి స్థాయికి దిగజార్చింది.

విశాలాక్షమ్మ మనోనేత్రంతో అదంతా గమనిస్తూనే ఉంది అనటానికి నిదర్శనంగా ఆమె మూసుకున్న రెప్పల కను కొలుకుల్లో నుండి వెచ్చని నీటి బిందువులు చెవుల మీదుగా జారుతున్నాయి.

గుండె బరువు కన్నీళ్ళ రూపం లో దిగిపోతే మనసు తేలికౌతుందన్న ఉద్దేశ్యంతో ధర్మమూర్తిగారు చూచీ చూడనట్లు తను కూడా కళ్ళు మూసుకున్నారు ఆమె పరిస్థితీ తనతో సమానమేనని తెలిసి...

నాగరికత బలిసిన ఈ రోజుల్లో బిడ్డలకు 'స్తన్య'మిస్తే ఆడదాని అందం తరిగిపోతుందన్న భయంతో నానారకాల ఆహారసంస్థలు వెలసి 'ఆయాలు' తయారయ్యారు. గానీ తాము బిడ్డల్నికనే రోజుల్లో పాలు పడటానికి నోరు మొరాయిస్తున్నా చిట్కా వైద్యాలతో నానా పదార్థాలుతిని తల్లి రక్తాన్ని పాలగా మార్చి స్తన్యమిచ్చే వాళ్ళు.

శరీర బిగువు సడలిపోతున్నా మానసికానందంతో పులకించి పరవశించేవాళ్ళే గాని సంకో చించేవాళ్ళు కాదు...

మరీ విశాలాక్షి... ఎదురు తెన్నులు చూసి చూసి ఇక పిల్లలే పుట్టరన్న ఆశ వదులుకున్న తరుణంలో చాలా కాలానికి లేక లేక పుట్టిన రాజా విషయంలో ఎనలేని శ్రద్ధాసక్తులు చూపి, అపురూపంగా పెంచింది.

అసహ్యం అనేది మచ్చుకైనా కనపడేది కాదు. కుడి చెయ్యి, ఎడం చెయ్యి అని తేడా చూపకుండా వాణ్ణి శుభ్రం పరిచేది.

ఆమె దృష్టినంతా వాడి సంరక్షణ కోసమే కేంద్రీకరించేది... కళ్ళన్నీ వాడిమీదే నిలిపి ఆశలన్నీ వాడిమీదే పెట్టుకుని ఆశయాలన్నీ వాడితోనే సిద్ధింప జేసుకోవాలనే లక్ష్యంతో తన కక్ష్యదాటి పోనీకుండా పెంచుకుంటున్న విశాలాక్షమ్మ ప్రయత్నంపై కొందరు ఈర్ష్యాద్వేషపు రాళ్ళు విసిరి పండంటి వాడి పసి జీవితాన్ని చేజిక్కించుకుని ఊపిరి పీల్చుకున్నారు. ఫలితం రాజా దృష్టిలో తల్లీ, తండ్రి అంటే రాక్షసులుగా, వారి మందలింపులు కర్కోటంగానూ, మంచి మాటలు చేదుగానూ, విషపూరితంగానూ తోచాయి.

తాము వాడి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని, సుఖ సంతోషాలను కొల్ల గొట్టే పిశాచాల్లా గోచరించారు.

ఆరోగ్యంగా పెరిగి మంచిఅలవాట్ల చిగురులు తొడిగి కొమ్మలూ, రెమ్మల్లాగా విస్తరించి పుష్పించి, ఫలించి మహావృక్షంగా వేళ్ళూన వలసినరాజా మనసుకు మొక్కతోనే చీడపట్టినట్లయి చెడిపోవటానికి చెప్పే తియ్యని తప్పుడు అబద్ధాలు చెడు అలవాట్లకు దారితీశాయి.

వాటిని చూచీ చూడనట్లు నిర్లిప్తంగా ఊరుకోవటానికి కన్నతల్లిగా ఆమె మనసు ఒప్పలేదు. అందుకే అజ్ఞానంతో వాడు వెయ్యబోయే తప్పటడుగును సమర్థించలేకపోయింది.

ఆ వంకర నడకను సరిదిద్దాలనే తలంపుతో తీవ్రంగా దండించింది. శిక్షించింది.

ఇనుప ముక్కనైనా మనకు కావలసిన ఆకారంలోకి తెచ్చుకోవాలంటే మండే కొలిమిలో పెట్టి వంగే వరకూ కాల్చాలి. అదే ఆమె సిద్ధాంతం!

కానీ...వాడి అంతరాత్మ మాత్రం అవమానంతో ఉడికిపోయి అదొక పరాభవంగా భావించి తల్లిదండ్రులంటే ద్వేషం పెంచుకుని గర్భశత్రువులుగా ముద్రవేసుకున్నాడు.



కె. భగవాన్‌రెడ్డి, బి.యస్.సి., బి.యిడి., (కార్టూనిస్ట్), మార్టేరు - 534 122, పశ్చిమ గోదావరి జిల్లా.

తామేమిటో బిడ్డలకు తెలియకపోయినా బిడ్డలంటే తల్లిదండ్రులకు వివరించనక్కరలేదు. వయసు వచ్చిందని వాడు చేసిన హెచ్చరికతో వెంటనే ఒకింటి వాణ్ణి చేశారు.

అనతికాలంలోనే ప్రయోజకుడై ఆనందంతో కాపురం చేసుకుంటూ బిడ్డకి తండ్రయ్యాడుగాని తల్లిదండ్రులంటే వాడి మనసులో శిలాక్షరాల్లాపడిన ముద్ర ప్రభావం అలాగే ఊడలు వేసింది.

ఫలితం వృద్ధాప్యంలో అన్నిటికీ అశక్తులైన తామిద్దరిపై కక్ష సాధిస్తున్నాడు. పెద్దరికం నిలబెట్టు కోవాలన్న తాపత్రయంతో బాధ్యతగా ఏదో చెప్పబోతే అర్థం చేసుకోకపోగా చిరాకుతో మందలిస్తాడు. 'విశాలా! వెనకటి కాలం కాదే. సంసారం నిలదొక్కుకునే దాకా పెద్ద దిక్కుకోసం ఆరాటపడటానికి. ఇప్పటి తరం వాళ్ళు అంత అమాయకులు కారు. తెలివి తేటలు ముందుపుట్టి ఆ తరువాత పిల్లలు పుడుతున్నారు.

మనలాంటి వృద్ధుల సలహాలు ఈనాటి కుర్రకారుకు అడ్డంకులు, ఆటంకాలే ఔతాయి. అనాగరికంగా, వ్యర్థంగా కనిపిస్తాయి.

ఈ దశలో మనం పూజ్య బాపూజీ సూక్తులు 'గుడ్డి తనం, మూగ తనం, చెవిటి తనం' అలవరచుకోవాలి.

బహుశా జీవిత చరమాంకంలో ఉన్న మనలాంటి వారి కోసమే ఈ మూడు సూత్రాలూ నిర్దేశించారేమో! మనలాంటి వారు పాటించటం శ్రేయస్కరం.

అలా పడి ఉండలేక ప్రతీ విషయంలో కలగ జేసుకుంటే... ఇప్పుడున్న కాస్త గౌరవానిక్కూడా దూర మౌతాం. అప్పుడు... ప్చ్" అనుభవ సారమంతా ఆయన మాటల్లో మిళితమై వెలువడుతోంది.

భర్తకోసం తనూ భావగర్భితంగా నవ్వుతుంది.

ధర్మమూర్తిగారి పేగుల అలజడి ఆమె గుండెను తాకింది!

స్వతంత్రించి, సాహసించి లోపలికెళ్ళి తన చేతుల్తో తెచ్చి ఆయనకు కడుపునిండా పెట్టుకునే అర్హత, అవకాశం ఆమెకులేవు.

రాజా శరీరనిర్మాణానికి తమ అలౌకిక ప్రణయశక్తే కారణమై వాడికీ తమకూ భేదం లేకపోయినా వాడి సొమ్ముపై వాడి సర్వస్వంపై తమకు సర్వహక్కులున్నా ఆత్మానుబంధం అనేది లేకపోవటానికి తమది అనుకున్న ఇంట్లో - తామే పరాయి మనుషులుగా, బెరుగ్గా, భీతిగా బ్రతకవలసి వస్తూంది.

వాళ్ళ సంబరంలో పడి మరిచారేమోనని కబళం కోసం బిచ్చగాళ్ళు గుర్తు చేస్తున్నట్లు దీనంగా అర్థించ్చారు.

అది లోపలున్న వాళ్ళకు విసుగు కలిగించింది కాబోలు!

"రాధీ! వాళ్ళ వెధవ గోలేదో వదిలించరాదూ" భార్యను హెచ్చరించాడు రాజా.

రాధిక లోపలికి వెళ్ళి ఆ బిచ్చగాళ్ళతోపాటు తమ క్కూడా భోజనాన్ని ప్లేట్లతో తెచ్చి ఇచ్చింది. మళ్ళీ మళ్ళీ తమచుట్టూ తిరిగే అవసరం లేకుండా చిన్న చిన్న అరల్లో పళ్ళేల్లోనే సర్దింది.

అది నాగరికత చేసిన ఏర్పాటు. అందులో పని తెములు్చకోటానికీ, బాధ్యత వదుల్చు కోటానికే తప్ప ఆత్మీయత, ఆప్యాయత అనేవి మచ్చుకైనా కనిపించవు...

కోడలు వేసిన అన్నాన్ని అక్కడికక్కడే ఆబగా తింటున్నారు బిచ్చగాళ్ళు...



చేతికి తీసుకున్న ముద్దను నోట్లో పెట్టుకోబోతూ భర్తను చూచి ఆగిపోయింది విశాలాక్షమ్మ...

బిచ్చగాళ్ళనీ; తన భర్తనీ మార్చి మార్చి చూసింది. తన చేతినీ, ఆయన నోటినీ తేరిపార చూచుకుంది.

తన చేతిలో ముద్దను ఆప్యాయంగా, అపురూపంగా ఆయననోటికి అందించింది. అనురాగ తరంగం ఎగసి పడుతూంటే ఆయన తన చేతిలోని ముద్దను ఆమెనోటికి అందించారు.

ఇద్దరి కన్నుల్లో నీరు ఉబికి, ఎదలపై జారుతూంది. ఇంకో ముద్ద... ఇంకో ముద్ద... ఒకరి చేతినుండి మరొకరి నోటికి అందించు కుంటూ... తృప్తిగా... అలౌకిక మానసికానందంతో...

ఆహారం పడేసరికి పేగులు శాంతించాయి. పేగులు శాంతించగానే కన్నతల్లి ప్రేమ బైట పడింది. అంతకు ముందే ఆకలి మంటతో...

"కాలచక్రం ముందుకు దొర్లి ఆ పసివాడు పెరిగి పెద్దవాడై తప్పటడుగులు సరిదిద్దిన ఆ తల్లిదండ్రులపై ఇలాగే కక్షసాధిస్తే... అప్పుడు తమ బాధ, మనోవేదన అర్థమౌతూంది." శపించిన మాటల్ని వెనక్కి తీసుకుంది.

మనసును మందలించుకుంది. కడుపుతీపి రాజా ను ఆశీర్వదిస్తోంది.

"మమ్మల్ని గురించి వాడి అభిప్రాయం ఏదైతేనేం? ఏదొకనాడు వాడే తెలుసుకుని ఆదరిస్తాడు. ఆప్యాయత కురిపిస్తాడు. వాడు భార్యాబిడ్డలతో సుఖంగా ఉన్నాడు ముమ్ముందు ఉండనీ."

మనసారా దీవించి గుండెలనిండా ఊపిరి పిల్చుకుని భర్తతో పాటు తనూ నిద్రకుపక్రమించింది విశాలాక్షమ్మ... ఈ పుణ్యభూమి 'సగటు అమ్మ'


శ్రీమతి ఉమా భాస్కర్
డి.ఎన్.ఎస్.ఎఫ్.సి క్వార్టర్స్,
ఎల్.పి.జి. వింగ్, శక్కర్ నగర్,
బోధన్ - 503 180.
నిజామాబాద్ జిల్లా


★




డి. శ్రీదర్, డి. కొండాపురం, రాయదుర్గ, అనంతపురం.